గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు



జీనులకుంటలో పీర్లను అలంకరించిన దృశ్యం



తాడిమర్రి: అలంకరణలో పీర్లు



బత్తలపల్లి: కాశీంస్వామికి పూజలు చేస్తున్న ముజావర్లు

గాండ్లపెంట: మండలంలోని తూపల్లి, గాండ్లపెంట, జీనులకుంట, గొల్లపల్లి, గొడ్డువెలగల గ్రామాల్లో మొహర్రం సందర్భంగా శనివారం గ్రామ చావిడిలో పీర్లు కొలువుతీరాయి. పెద్దమౌలాలి, చిన్నమౌలాలి పీర్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఈనెల 17న పెద్ద సరిగెత్తు జరగనుంది. 5 రోజులు పీర్లను పూలతో అలంకరించి ఆయా గ్రామాల పురవీధుల్లో ఊరేగిస్తారు. చివరి రోజు పీర్లను జలధికి తరలించి వేడుకలు ముగిస్తారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి..

మొహర్రం పండుగను ఆయా గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ కృష్ణవేణి ఆయా గ్రామాల ముజావర్లకు సూచించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఆయా గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాడిమర్రిలో..

తాడిమర్రి: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పీర్ల పెట్టెను గ్రామంలో ఊరేగించారు. శనివారం ఉదయం కుల్లాయ స్వామి, అక్బర్ స్వామి, పెద్దకాశీం, చిన్నకాశీం, అటుకులప్ప తదితర పీర్లు శనివారం కొలువుదీర్చారు. పీర్లకు నూతన వస్త్రాలు ధరింపచేసి, వెండి గొడుగులు తొడిగి, పలు రకాల పూలమాలలతో అందంగా అలంకరించి పీర్ల చావిడిలో కొలువుదీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పీర్లకు చక్కెర, బెల్లం చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఖాసీంస్వామికి నిత్యపూజ నివేదన

బత్తలపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బత్తలపల్లి ఖాసీంస్వామికి శనివారం నిత్యపూజ నివేదన నిర్వహించారు. తెల్లవారుజామున ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశీంవలిలు ఖాసీంస్వామి చావిడిలో ఫాతెహాలు చేశారు. అదేవిధంగా మండలంలోని గంటాపురం, ముష్టూరు, మాల్యవంతం, సంజీవపురం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి తదితర గ్రామాల్లోనూ నిత్యపూజ నివేదన చేసినట్లు ముజావర్లు తెలిపారు.

కనగానపల్లిలో అన్నదానం..

కనగానపల్లి: మండల కేంద్రంలో మొహర్రం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. దస్తగిరి, కుళ్లాయి స్వామి భక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రతిరోజు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కుళ్లాయి స్వామి భక్తులు చింతమేకల పెద్ద నల్లప్ప కుమారులు నాగేంద్ర, పెదకుళ్లాయప్ప, చిన్నకుళాయప్ప సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో పాటు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు స్థానిక గ్రామస్తులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్నసరిగెత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

గాండ్లవారి పల్లిలో..

ముదిగుబ్బ: మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం మండల పరిధిలోని గాండ్లవారిపల్లి గ్రామంలోని పీర్ల చావిడిలో పీర్లు కొలువుదీరాయి. వారం రోజుల పాటు జరిగే ఈ మొహర్రం వేడుకల్లో మొదటి రోజు పీర్లను ప్రత్యేకంగా అలకంరించి పూజలు చేశారు. పీర్ల చావిడికి ముందు భాగంలో అగ్ని గుండం తీసి వాటిలో మంటలు వేశారు. పీర్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ముదిగుబ్బ: పీర్లకు చదివింపులు చేసిన దృశ్యం



కనగానపల్లిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

గూగూడుకు ఆర్టీసీ బస్సులు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం సత్యనారాయణ

ధర్మవరం అర్బన్: గూగూడు ఉత్సవాలకు ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ డీఎం సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలోని డీఎం చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎం మాట్లాడారు. ఆదివారం నుంచి గురువారం వరకు బస్సు సరీ్వసులు అందుబాటులో ఉంటాయన్నారు. బత్తలపల్లి సర్కిల్‌లో కూడా టెంటును ఏర్పాటు చేసి అక్కడి నుంచి భక్తుల సౌకర్యార్థం బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. గూగూడుకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పౌర్ణమికి ధర్మవరం నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామని తెలిపారు. కొత్తగా అయోధ్య, కాశీకి కూడా బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఎవరైనా బృందంగా ఏర్పడి వస్తే ప్రత్యేక బస్సు పంపిస్తామన్నారు. ధర్మవరం నుంచి చెన్నై బస్సును ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. ఈ సర్వీసుతో తిరుమల టికెట్లు కూడా ఇస్తున్నామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, సిస్టం సూపర్‌వైజర్ సుధాకర్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఏర్పాటు



మాజీ ముతవల్లి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ముతవల్లి సులేమాన్

బత్తలపల్లి: మండల కేంద్రంలోని జామియా, మదీనా మసీదులకు నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు మతపెద్దలు తెలిపారు. శుక్రవారం రాత్రి పాత కమిటీ, నూతన కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. మంత్రి సత్యకుమార్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సిఫార్సుల మేరకు నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు మతపెద్దలు పేర్కొన్నారు. ముతవల్లిగా సులేమాన్, వైస్ ముతవల్లిగా ముక్తుం ఇస్మాయిల్, కార్యదర్శిగా ఎల్ఎస్ సుబహాన్, వైస్ కార్యదర్శిగా షామీర్, ట్రెజరర్‌గా మదీనా మౌలా, కమిటీ సభ్యులుగా టైలర్ రాజా, టైలర్ రఫీ, డ్రైవర్ మున్నా, షరీఫ్, ఎస్‌బిటి కాశీంవలి, కాశీంవలిని ఎన్నుకున్నారు. ఈ కమిటీని వక్ఫ్ బోర్డుకు పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం ముతవల్లి సులేమాన్, నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ముస్లింల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తూ మసీదుల అభివృద్ధికి పాటుపడతామన్నారు.

ఆశా కార్యకర్తలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి



తనకల్లు: మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు



ధర్మవరం అర్బన్: మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు



ధర్మవరం అర్బన్: సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ వర్కర్లు

తనకల్లు: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అతి తక్కువ జీతంతో ఆశా కార్యకర్తలు విధులను నిర్వహిస్తున్నారన్నారు. కరోనా సమయంలో వీరి సేవలు మరవలేనివన్నారు. ఆశా కార్యకర్తలపై రాజకీయ ఒత్తిళ్లకు గురి చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే ఆశా కార్యకర్తలకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జే.నరసింహులు, మండల అధ్యక్షుడు ఒంటెద్దు వేమన్న, సీపీఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రమణ, ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు కళావతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ప్రాజెక్టు నాయకురాళ్లు చంద్రకళ, సరస్వతి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనంతోపాటు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లకు భారంగా మారుతున్న యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్ ద్వారా పని చేయించాలని సూచించారు. ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను కాయగూరల బిల్లులను చెల్లించాలన్నారు. మెనూ చార్జీలను పెంచాలని విన్నవించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాష, మండల అధ్యక్షుడు అయుబ్ ఖాన్, కార్యదర్శి ఆదినారాయణ, జేవీ రమణ, మారుతి, నామాల నాగార్జున, రఫి, బాలాజి, అంగన్‌వాడీ వర్కర్లు పోతక్క, గోవిందమ్మ, దీనా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఒత్తిడి దూరం

● సబ్ కలెక్టర్ అపూర్వ భరత్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: క్రీడలతోనే మానసిక, శారీరక ఒత్తిడి దూరమవుతుందని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ జిల్లా స్థాయి క్రీడా వేడుకలను ప్రారంభించారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు రామాంజనేయులు జ్ఞాపకార్థం టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రికెట్ పోటీలను ప్రారంభించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. యూటీఎఫ్ నాయకులను అభినందించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ ఈ పోటీలు ఈనెల 13 నుంచి ఆగస్టు చివరి వారం వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ టాస్ వేసి, పోటీలను ప్రారంభించారు. యూటీఎఫ్ నాయకులు నరేష్, భూతన్న, హరికృష్ణ, నారాయణస్వామి, మహలింగప్ప, నబీ, మారుతి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి పాడి ఆవు మృతి



ఆవును చూసి కన్నీరుమున్నీరవుతున్న రైతు శ్రీరామప్ప

పరిగి: గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడలు కానీ, ఫెన్సింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పెద్దిరెడ్డిపల్లిలో శనివారం సాయంత్రం ఇదే కారణంతో ఓ పాడి ఆవు మృత్యువు పాలైన ఘటన గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరామప్ప తన ఆవును మేతకోసమని ఉదయం తీసుకెళ్లాడు. ఇంటికి వస్తున్న సమయంలో గ్రామంలోని రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డిని మేస్తుండగా, ప్రమాదవశాత్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన వైర్లు తగలడంతో పాడి ఆవు అక్కడికక్కడే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. తనకున్న జీవనాధారం పాడి ఆవు అని, విద్యుత్ షాక్‌తో దాదాపు రూ.50 వేల విలువైన ఆవును కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు.

త్వరలో పావగడకు సాగునీరు



రైల్వే పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి సోమణ్ణ

పావగడ: భద్రమేల్దండె సాగు నీటిని త్వరలోనే పావగడకు అందించి చెరువులు నింపుతామని కేంద్ర రైల్వే, జలశక్తి శాఖా మంత్రి వి.సోమణ్ణ తెలిపారు. శనివారం ఆయన రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ పనుల పరిశీలనకు పావగడకు విచ్చేశారు. రొప్పం పరిధిలో నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, కూటమి మిత్రుడు మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప సహకారంతో రైల్వేలైన్ పనులు 2026 డిసెంబర్ నెలలో ముగిస్తామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాని మోదీని ప్రత్యేక ప్యాకేజీ, బీహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రత్యేక హోదా అడుగుతున్నారని అయితే కర్ణాటక బీజేపీ మంత్రులు మోదీ ఎదుట ఎందుకు చేతులు కట్టుకుని కూర్చున్నారని ఓ విలేకరి ప్రశ్నించారు. ఎన్డీఏ కూటమి మిత్రులు అడిగినా తప్పేమి లేదని మంత్రి సమాధానం ఇచ్చారు. భద్రమేల్దండె సాగు నీటిని పావగడకు త్వరలోనే అందించి చెరువులు నింపుతామన్నారు. అంతకు ముందు రాజవంతి సరిహద్దులో మంత్రి సోమణ్ణకు కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఆర్సీ అంజినప్ప, ఈరణ్ణ, మంజునాథ చౌదరి తదితర జేడీఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అతిథి గృహంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, అతని తండ్రి మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితరులు మంత్రికి పూల మాలలు వేసి సన్మానించారు. స్థానిక జేడీఎస్ నాయకుడు సాగడు వెంకటేశ్ తాలూకా సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నేత శివప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, శంకరరెడ్డి, బత్తినేని నాని, రాజేశ్, రవి తదితర కాంగ్రెస్ నాయకులు, బీజేపీ, జేడీఎస్ నేతలు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు నిత్యావసరాల పంపిణీ

రొళ్ల: స్థానిక ఆర్డీటీ కార్యాలయ ఆవరణలో శనివారం రొళ్ల, అగళి మండలాలకు చెందిన 70 మంది ఆసరా లేని ఒంటరి మహిళలకు నిత్యవసరాలు పంపిణీ చేసినట్లు ఏటీఎల్ ఓబులేష్ తెలిపారు. ఒక్కో మహిళకు 30 కిలోల బియ్యం, 4 కిలోల బ్యాళ్లు, 2 కిలోల చొప్పున బెల్లం, గోధుమ, రాగి పిండితో పాటు ఒక పాకిట్ పామాయిల్, సబ్బు ఇతరాత్ర సరుకులు అందించామని పేర్కొన్నారు. అనంతరం ఆయన మహిళలతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి ప్రతి రెండు నెలలకు ఒకసారి నిత్యావసర సరులు పంపిణీ చేస్తామన్నారు. ఆర్డీటీ అందించే సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎల్ బాలయ్య, సీఓలు హనుమంత రాయుడు, శివప్రసాద్, ఓబులేష్, నాగమణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి హరికుమార్

రొద్దం: మండలంలోని బీదానిపల్లి గ్రామానికి చెందిన రైతు కల్లకుంట రామాంజనేయులు కుమారుడు హరికుమార్ ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని, తద్వారా బాగా చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినట్లు విద్యార్థి చెప్పాడు. మడకశిర ఎంజేపీ పాఠశాలలో పదోతరగతి చదివినట్లు తెలిపారు.

క్లుప్తంగా

చెరువుకట్ట ఆంజనేయుడికి పూజలు



అలంకరణలో చెరువుకట్ట ఆంజనేయుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను అర్చకులు తమలపాకులు, వివిధ రకాల పూలు, వెండి ఆభరణాలు, తులసి మాలలు, వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్: పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు ఈనెల 20న కదిరి డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 21న పౌర్ణమి పురస్కరించుకుని 20వ తేదీ ఉదయం 9 గంటలకు డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సులో కాణిపాకం, కంచి, స్వర్ణదేవాలయం కూడా దర్శించుకోవచ్చన్నారు. ఈ సర్వీసుకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ఈ నాలుగు క్షేత్రాలను దర్శించుకునేందుకు సూపర్ లగ్జరీలో రూ.1,300, ఎక్స్‌ప్రెస్‌లో రూ.1,050 టికెట్ ధర కేవలం నిర్ణయించినట్లు వెల్లడించారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న న్యాయవాది బాలసుందరి

ధర్మవరం: లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, న్యాయవాది బాలసుందరి, హెడ్‌కానిస్టేబుల్ నాగపవన్ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మోటార్ వెహికల్ యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయరెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లచెరువు: నల్లచెరువు, మద్దిమడుగు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వాగ్దేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.


ఆకట్టుకున్న పౌరాణిక నాటకం



కళాకారులను అభినందిస్తున్న కళాజ్యోతి కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతిలో శనివారం సాయంత్రం నిర్వహించిన పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. ధర్మవరం రామకృష్ణమాచార్యులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు శింగనమల రామకృష్ణలు పౌరాణిక కళాకారులను అభినందించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర సురభి థియేటర్ సురభి జయచంద్రవర్మ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్త ప్రహల్లాద పౌరాణిక నాటకం అందరిని అలరించింది.

గౌరీ మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎంపిక



సమావేశమైన నూతన కమిటీ సభ్యులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొండేపాళెంలో శనివారం గౌరీ మహిళా గ్రామ సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అరుణమ్మ, సెకండ్ లీడర్‌గా గంగాదేవి, మూడవ లీడర్‌గా అయేషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీ శ్రీనివాసులు, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీరమారుతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు



బయ్యారెడ్డిపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మహేశ్వర మారుతి

గాండ్లపెంట: మండల పరిధిలోని సామాలగొంది పంచాయతీ సింగానివారిపల్లి, బయ్యారెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం వైద్యాధికారి మహేశ్వర మారుతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందించారు. అదే విధంగా రక్తపోటు, చక్కర వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, స్థానిక ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

16న బహిరంగ వేలం

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసంలో పూజా సామగ్రి, టెంకాయలు విక్రయించేందుకు ఈనెల 16న మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రవీంద్ర రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

నీటి సమస్య పరిష్కారం



రాట్నాలపల్లిలో మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నల్లచెరువు: మండల పరిధిలోని రాట్నాలపల్లి గ్రామంలోని పంచాయతీ బోరు మోటార్ 15 రోజుల క్రితం కాలిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంపీపీ రమణారెడ్డి శనివారం కొత్త మోటారు ఏర్పాటు చేయించారు. నీటి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

'డయాబెటిస్‌ను నియంత్రించవచ్చు'



తోలు బొమ్మలాట ద్వారా అవగాహన కల్పిస్తున్న పద్మినీ రంగరాజన్

బత్తలపల్లి: సమాజంలో ఆందోళనకరమైన రోగంగా వ్యాప్తి చెందుతున్న డయాబెటిస్‌ను మానసిక స్థైర్యంతో, సమయానికి మందులు వాడుతూ నియంత్రణలో ఉంచుకోవచ్చని హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుకేషన్ పప్పేట్రియర్ పద్మినీ రంగరాజన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ ఆసుపత్రిలో టైప్‌వన్ డయాబెటిస్‌పై తోలు బొమ్మలాట ద్వారా అవగాహన కల్పించారు. తోలు బొమ్మలాటల ద్వారా చదువు, ఆరోగ్యం తదితర అంశాలపై వివిధ రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డయాబెటిస్ అంటు వ్యాధి కాదని.. తోటి పిల్లలతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. పద్మినీ రంగరాజన్ హైదరాబాద్‌లో ఆర్ట్ ఆఫ్ రాజన్ సంస్థ, స్వీట్ బడ్డీ, స్వీట్ పోల్స్ సంస్థలో వలంటీర్‌గా బొమ్మలాట ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈమె మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఫెలోషిప్‌లో 2021–22లో సీనియర్ ఫెలోషిప్ సాధించారు. 2025 వరకు ఈ ఫెలోషిప్‌లో కొనసాగుతారు. టైప్‌వన్ డయాబెటిస్‌పై అవగాహన కోసం 9866081172 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.